# కథ పూర్తికాలేదు

చాలాకాలానికి కథ వ్రాయాలని కూర్చున్నాను.

ఓ మంచి ఘాటైన ప్రేమకథ వ్రాయడానికి ప్లాటు కోసం ఆలోచించసాగాను.

రెండురోజుల క్రిందట, నా స్నేహితురాలు నీరజ, ఢిల్లీనుంచి వ్రాసిన ఉత్తరం జ్ఞాపకం వచ్చింది.

"నీ కథలు ఈమధ్య ఏ పత్రికలోనూ రావడంలేదు. నా స్నేహితురాలు ఒకరచయిత్రి అని గొప్పగా చెప్పుకుంటూ వుంటాను. కాని నువ్వు వ్రాసిన ప్రతికథ నాకు నిరాశనే కలిగించింది. నీ ఇతివృత్తం ప్రతిసారీ శుష్కంగానే వుంటుంది. రచనలో ఆర్ద్రత కన్పించదు. గుండెలోని తడి కన్పించదు. గుండెల్ని స్పందింపచెయ్యదు. ఇలా రాస్తున్నందుకు బాధపడకేం! నీ కథల్లో కమనీయ కల్పనకు తావులేదు. అందుకే పాఠకుల హృదయాలను ఉద్రూతలు ఊగించలేక పోతున్నాయి. నువ్వు అశేషజనానికి అభిమాన - ఆరాధ్య రచయిత్రివి కాలేకపోతున్నావు' ఇకనుంచి అయినా చక్కని కథలు - కొన్ని కథలైనా.... పాఠకుల హృదయాలను పిండేవి వ్రాయి. ఇది నా కోరిక" - అంటూ ఏమేమో వ్రాసింది నీరజ.

నీరజకు జవాబు వ్రాయడం ప్రారంభించాను -

"అయితే నీరజా! నా కథల్లో ప్రేమను భుజించి

జీవించేవారికి చోటులేదంటావు? నా కథా నాయకుడు నాయకి సౌందర్యానికి ముగ్ధుడై భ్రమరంలా ఆమె చుట్టూ ప్రదక్షిణం చెయ్యడం లేదంటావు! ఆ తరవాత నిరాశతో, నిస్పృహతో కన్నీటి కాలవలో మునిగి ఆత్మసమర్పణ చేసుకోవడం లేదంటావు? అంతేనా?

నా గుండెల్లో ఆర్ద్రత లేదని నీ భావం! కాని నువ్వు పొరపడుతున్నావు. ఒక అందమైన వస్తువును చూసినప్పుడూ, మధురగానంవిన్నప్పుడూ, నా హృదయంకూడా ఏదో అవ్యక్త వేదనా జనిత అనుభూతికి గురి అవుతుంది. నా మస్తిష్కంలోనూ ఎన్నో ప్రేమకథలూ—ఆ కథల్లో ఇంద్ర ధనస్సు రంగులూ—ఆ రంగుల్లో సృష్టి సౌందర్యాన్నంతా తమలోనే ఇముడ్చుకున్నారా అన్నంత అందమైన సోగకళ్ళ అమ్మాయిలూ-ఆ అమ్మాయిల మనసుల్ని దోచుకొనే జేమ్సబాండ్ లాంటి హీరోలూ—తిరుగుతూనే వుంటారు.

కాని అంతకంటే ఎక్కువగా హైడ్రోజన్ బాంబులూ-ఆటమ్ బాంబులూ-స్పుట్‌నిక్‌లు-కాలే కడుపులతో, చంకలో శోషకువచ్చిన పసిబిడ్డల్తో, ఎముకలు తోలు సంచిలో వేసి కుట్టినట్టు వుండి, క్యూలో రేషన్‌కొరకు గంటలకొద్దీ నిలబడి చివరకు రేషన్ దొరక్క వెనక్కు తిరిగే స్త్రీలూ- రెక్కలు ముక్కలయేలా వెట్టిచాకిరీ చేసినా పెళ్లాం బిడ్డల్ని పోషించ లేని ఎన్. జీ. వోలూ....ఇంకా ఇంకా ఎందరో దగాపడిన మానవులు-నా కళ్ళముందు కదులుతూ ఉంటారు. వాళ్ళంతా ప్రేమ జీవుల్ని నా బుర్రలోనుంచి నెట్టేస్తారు...."

కాని ఉత్తరం పూర్తి చెయ్యలేదు. ఒక మంచి ప్రేమ కథ వ్రాసి, నేను కూడా ప్రేమకథలు వ్రాయగలనని రుజువు చేసుకున్న తర్వాతే నీరజకు ఉత్తరం వ్రాయాలనుకున్నాను.

అందుకే ఒక మంచి ప్రేమకథ వ్రాయడానికి కూర్చున్నాను. ప్రేమకథ వ్రాయాలంటే ప్లాటుకోసం బుర్ర బద్దలు కొట్టుకోనక్కర్లేదు. పోతే మంచి హీరోయిన్నీ, హీరోనూ వెతుక్కోవాలి.

పాఠకుల్ని ఉర్రూతలు ఊగించాలంటే హీరోయిన్ ఎలా వుండాలి? సన్నగా, పొడవుగా, పొగకళ్ళతో, కోల ముఖంలో వుండే హీరోయిన్ బాగుంటుందో లేక చంద్ర బింబంలాంటి ముఖంతో, ఆలిచిప్పల్లాంటి కళ్ళతో, బొద్దుగా గుండ్రంగా మూడు సున్నాలు చుట్టినట్లు వుంటే బాగుంటుందో ఎంత ఆలోచించినా తెల్సుకోలేకపోయాను.

హైదరాబాద్‌లో నాకు తెలిసిన వీధులన్నీ వెదికాను. ఊహూ! సకల సద్గుణాలకు ఆలవాలమైన సౌందర్యరాశి దొరకలేదు.

ఆలోచించాను బుర్ర వేడెక్కేలాగ. కాని నా కళ్లకు కట్టిన ప్రతి హీరోయిన్‌లోనూ ఏదో లోపం కన్పిస్తూనే వుంది.

విసుగ్గా కలం, కాగితాలూ పక్కనపెట్టి లేచి కిటికీ దగ్గిరకు వెళ్లాను. కిటికీ చెక్కలు తెరిచాను. గాలితోపాటు చిల్ల పెంకులు విసిరినట్టు వానజల్లు దూసుకు వచ్చింది.

బయటికి చూశాను. వంచకుని హృదయంలోని కాలుష్యంలా చిక్కని చీకటి నలువైపులా అలుముకొని వుంది.

"అయ్యో! ఇల్లంతా జల్లుతో తడుస్తుంటే అట్లా చూస్తూ నిల్చుంటావేమే!" అమ్మ ఆదుర్దాగా అన్నది.

ఉలిక్కి-పడ్డాను. కిటికీ మూ-సి, టవల్‌తో ముఖం తుడుచుకుంటూ కుర్చీలో కూర్చున్నాను.

కళ్లు మూసుకొని హీరోయిన్ని వెతుక్కుంటూ మళ్లీ ప్రయాణం సాగించాను.

అదుగో! నాకు కావాల్సిన హీరోయిన్! ఆ చిన్న కొండ శిఖరంమీద ఎంత వయ్యారంగా నిలబడివుందో? ఏమా దివ్య సౌందర్యం! విధాత మెరుపును పట్టి తెచ్చి తేనెలో రంగరించి ఆమెకు పూశాడు. కోడెత్రాచుల్ని తెచ్చి జుట్టుగా అమర్చాడు. రెండు పెద్ద పెద్ద చేపల్తో కళ్లుపెట్టాడు.

ఆమె తన అందమైన కళ్ళకు మేఘాలను రంగరించి కాటుకగా దిద్దుకుంది. ఇంద్రధనస్సును చీరగా ధరించింది. సంధ్యారాణి చెక్కిళ్ల అరుణిమను చిటికెన వ్రేలుతో నొసట తిలకంగా దిద్దుకుంది.

ఆమె కళ్లు ఎటు తిప్పితే అటే గులాబీలు పూస్తు న్నాయి. ఆ కళ్ళలో ఏదో ఆరాటం....ఎవరికోరకో నిరీక్షణ-

ఆఁ తర్వాత? కలం కదలదేం? అంతవరకూ బ్రహ్మాండంగా నడిచిన నా ప్రేమకథ ఎదురు తిరిగింది. కాళ్ళల్లో సత్తువ లేనట్టు మొండిగా చతికిల పడింది. ఎంత బతిమాలినా "నడవను గాక నడవను" అని మొరాయించింది.

ఏం చెయ్యను! నా హీరోయిన్ కేసి దిగులుగా చూశాను. ఆమె కోపంగా, చిరాగ్గా "ఇంకెంతసేపు నన్ను

ఇలా ఈ కొండమీద నిల్చోబెట్టావ్ ?" అన్నట్టు చూసింది.

నేను జాలిగా నాకథ కేసి చూశాను.

మెదడులో ఒక మెరుపు మెరిసింది. "ఎవరికోసం లేచి నడుస్తావ్ ? లే! నిల్చో!" అన్నట్టు కథ కేసి ధీమాగా చూశాను.

తర్వాత కథను నడిపించాలంటే హీరోను ప్రవేశ పెట్టాలి. హీరో కావాలి. కాని మళ్ళీ మొదటికే వచ్చాను. ఎలాంటి హీరోను ప్రవేశపెట్టాలి ?

హీరో గుర్రం ఎక్కి రావాలా? లేక విమానం లాంటి కార్లోనా ? ఆ హీరోకి గుర్రం సవారీ, కారు డ్రైవింగుతో పాటు అవసరం అయితే హెలికాప్టర్, రైలింజను కూడా నడపటం చేతనై వుండాలి.

మరి నా హీరో రంగ ప్రవేశం ఎలా చేస్తాడో నిర్ణయించుకోవాలిగా ?

గుర్రం ఎక్కివస్తే! అబ్బే ఈ రోజుల్లో హీరోలు గుర్రాలమీద రావడం ఏమిటి జానపద చిత్రాల్లోలాగ !

నా హీరో ఇంపాలా కార్లో వస్తాడు. ఆరు అడుగుల ఎత్తు వుంటాడు. అవసరం అయితే ఇంగ్లీషు సినిమాల్లోని హీరోలా హీరోయిన్ని అమాంతం భుజంమీద వేసుకొని వెళ్ళిపోతాడు.

కాని.... కార్లో వచ్చే హీరోలతో ఒక చిక్కువుంది. వాళ్ళ గురించి వ్రాయడానికి ఏమీ వుండదు. వస్తూనే హీరోయిన్ను కార్లో వేసుకొని తుర్రున వెళ్ళిపోతాడు.

అందుకే నా హీరో నడిచి వస్తాడు. చెదిరిన జుట్టూ,

చిరిగిన షర్టూ, మాసిన పాంటూ—కాళ్ళ చెప్పులు వుండాలా వద్దా—ఉంటాయి కాని చిరిగిపోయి వుంటాయి-మరి చేతిలో ఏదైనా బాటిల్....

ఒక్కసారిగా పెళ పెళ మంటూ ఉరుము ఉరిమింది. ఉలిక్కిపడ్డాను.

"ఎక్కడో దగ్గర్లోనే పిడుగు పడినట్టుంది" అన్నది అమ్మ.

చేతిలో కలం జారి కింద పడింది.

పిడుగుపాటుకే ఇంత భయంకరమైన శబ్దం అయిందే మరి. ఆటంబాంబు పడితే? వణికిపోయాను.

ఆనాడు సరిగ్గా ఆటంబాంబు పడే సమయానికి హిరోషిమాలో ఎందరు తల్లులు తమ పిల్లల్ని అక్కున చేర్చుకుని, వారి భవిష్యత్తు గురించి బంగారు కలలుకంటూ పడుకొని వుండి వుంటారో! వాళ్ళందరూ ఆ కలల్లోనే కరిగి కలిసిపోయి వుంటారు.

కాని ఆ వార్తవిని, యూరప్‌లోని ఎన్ని మాతృ హృదయాలు ఆనందంతో తృళ్ళిపడి వుంటాయో—యుద్ధం ముగుస్తూందనీ, తమ బిడ్డలు తిరిగి ఇళ్ళకు చేరుకుంటారనీ ఆశిస్తూ-సృష్టి వైచిత్ర్యం.

అరే! ఇదేమిటి? తన వ్రాయబోయే ప్రేమకథకు ఈ ఆలోచనలు ఏమిటి? అందమైన ఆలోచనలు రావాలిగాని?

అవును? మర్చిపోయాను. నా హీరో ఏడీ? పిరికి పంద! పిడుగు శబ్దానికే పారిపోయాడు! పోనియ్!

హీరోయిన్‌వైపు చూశాను. హీరోయిన్ బుంగ

మూతి పెట్టింది. కోపంలో ఎంత అందంగా వుందో నా హీరోయిన్ !

"ఆఁ ఏమిటీ వెళ్ళిపోతావా! నాకు, నీకు తగిన హీరోను తెచ్చే శక్తి లేదా? మా తల్లివిగదూ.... నీకు తగిన హీరోను వెతుక్కొస్తాగా! కొంచెంసేపు ఓపికపట్టు-

మాటయితే అన్నాను. కాని ఎక్కడ్నుంచి తేను ఆమెకు ఈడైన హీరోను?

ఆఁ ఆఁ! గుర్తొచ్చాడు. చిన్నప్పుడు అమ్మమ్మ ఎంత మంచి హీరో గురించి ఎన్ని కథలు చెప్పింది? అన్ని కథల్లో దాదాపు ఆ హీరోనే వుంటాడు. ఆ మాటకొస్తే ఈనాటి సీరియల్సులో-అదే ప్రేమకథల్లో మాత్రం ఒకలాంటి హీరో ఉండడం లేదూ? ఇక భయం లేదు. నా కథ సాఫీగా నడక ప్రారంభించగలదు!

వర్షం అంతకంతకూ పెరుగుతూంది. మధ్య మధ్య ఉరుములూ, మెరుపులూను.

అరె! ఈ కథ గొడవలోపడి లైకా సంగతే మర్చిపోయాను. పాపం! వర్షంలో తడిచిపోయివుంటుంది. దానికి జబ్బు చేస్తే మళ్ళీ ఆసుపత్రిచుట్టూ తిరగలేక చావాలి.

తలుపు తెరిచానో లేదో, వరండాలో ఒకమూల ముడుచుకొని పడుకొనివున్న లైకా ఒక్కసారిగా లేచి వళ్లు విదిలించుకొని, తోక ఆడిస్తూవచ్చి, నా ఎదురుగావున్న కుర్చీలోకి ఒక్క ఎగురు ఎగిరి పడుకుంది. అలా పడుకొని నాకేసి చూసింది. నోరులేని కుక్కపిల్ల కళ్ళతోనే కృతజ్ఞత తెలుపుతుంది.

వెంటనే నాకు రోజూ అమీర్ పేట బస్‌స్టాండ్‌లో కన్పించే ముసలి బిచ్చగాడు గుర్తొచ్చాడు. పాపం! ఈ వర్షంలో ఏమైనాడో ఏమో! ఎంతో కాలంగా ఆ శరీరాన్ని అంటిపెట్టుకొనివున్న మురికి గుడ్డపీలికలు తడిచి వంటికి అతుక్కొని ఆత్మీయతను తెలియపరుస్తూ వుండి వుంటాయి. ఈ వర్షంలో, బస్‌స్టాండ్‌లో వున్న షెడ్‌లో వణుకుతూ పడుకున్న ఆ ఎముకల గూటిని వదిలి జీవహంస లేచిపోతుందేమో తెల్లారే సరికల్లా!

అతను నన్ను చూడగానే ఆశగా దగ్గరికి వస్తాడు. తను ఇచ్చే ఐదుపైసలూ తీసుకొని ఏదో గొణుక్కుంటాడు. దీవిస్తాడు. అతని దీవెనలు అందుకోని రోజు నాకెలాగో వుంటుంది.

రేపు అతను బస్‌స్టాండ్‌లో కన్పించడేమో! లేక అతని శవం.... ఈగలూ, చీమలుతో నిండి కన్పిస్తుందేమో! వెన్నెముకలో ఏదో జరజర పాకినట్టనిపించింది.

నా ఆలోచనల్ని అర్థం చేసుకుంటున్నట్టు లైకా నా ముఖంలోకి చూస్తూ పడుకుంది.

"లైకా! జంతువువైనా ఆ మనిషికంటే నువ్వేఅదృష్టవంతురాలివి. నీకు తెల్లవారేసరికి బిస్కెట్లూ, పాలూ కావాలి. ఒక్కరోజు మాంసం లేకపోతే అన్నం ముట్టవు. నువ్వు అన్నం తినక పోతే నాకూ తిన బుద్ధి పుట్టదు" అన్నాను అనుకోకుండా పైకి.

లైకా అదోలా నా ముఖంలోకి చూస్తున్నట్టు అన్పించింది.

లైకాకే మాటయిస్తే....!

ఏమిటి ఈ పిచ్చి ? నా కథ- అదే ప్రేమకథ ఏమైంది ? వెధవ ఆలోచనలూ-నేనూ !

నీరజ వ్రాసినట్టు నిజంగానే నాకు అందమైన ఊహలు రావేమో! ప్రేమకథ వ్రాయ లేనేమో?

ఎందుకు వ్రాయలేనో చూస్తాను! ఇవ్వాళ ఈ ప్రేమ కథ పూర్తిచేసికాని నిద్రపోను.

అరె ! నా హీరోయిన్ ఏదీ ! ఎక్కడకెళ్ళిపోయింది ? నాతో లాభంలేదని తెలుసుకొని మరో రచయిత్రి దగ్గిరకు వెళ్ళిపోయిందా !

పోతే పోనియ్ ! మంచిపనే అయింది. ఆ హీరోయినూ ఆ వర్ణనా....అబ్బా....పాతకాలం కంపుకొడుతూవుంది. కాని ఆ వర్ణనతో, అదే హీరోయిన్‌తో కథ వ్రాస్తే తప్పక సినిమా ఛాన్స్ వస్తుంది. కాని తనకు చేతకావడం లేదే! ఏం చెయ్యడం ?

పోనియ్ ! ప్రేమ పందెంలో ఓడిపోయిన హీరోతో కథ ప్రారంభిస్తే ! వండర్‌ఫుల్ ! ఈ రోజుల్లో ఇలాంటి కథ లకు మంచి డిమాండే వుంది. తెల్లారేప్పటికి సినిమా ప్రొడ్యూ సర్స్ క్యూలో నిలబడరూ ? ఆ దెబ్బతో ఆంధ్రదేశంలో బోలెడంత కీర్తిని సంపాదించుకోవచ్చును !

ఊరికి దూరంగా-గోదావరి వొడ్డున-ఒక పూరిగుడిసె వుంది ! ఆ గుడిసెలో కోడిగుడ్డు దీపం మిణుకుమిణుకుమంటూ వెలుగుతూవుంది. దీపపు పురుగులు లాంతరు చుట్టూ చేరాయి. రెక్కలు విరిగిపోతున్న పురుగు కొంచెంసేపు పాకి ఆగిపోయి బిగుసుకుపోతున్నాయి, వడ్లసేలాల లాగ. వాటిని చూసి

మిగతా పురుగులు ఆగటంలేదు. వస్తూనేవున్నాయి. చస్తూనే వున్నాయి. మరి దీపం ఆకర్షణ అలాంటిది. అలాగే ప్రేమ పక్షులు చేరుగాథల్ని వింటూ కూడా ఆగరు. ఆ ఆర్తి.... ఆ జ్వాలకు—అలాగే ఆహుతి అవుతాయి.

అతను ఆ పురుగుల్ని చూస్తూ ఆలోచిస్తున్నాడు. అతని ముందు కొన్ని కాగితాలు పడివున్నాయి. ప్రియురాలికి ఆఖరి సందేశం పంపించే ప్రయత్నం చేస్తున్నాడు. అస్తిపంజరానికి తోలుకుట్టినట్టు వున్న ఆ యువకుడు పురుగుల్నే దీక్షగా చూస్తున్నాడు. చావుకూ-బతుక్కూ అట్టే దూరంలేదు. గాలిలో ఎగురుతున్న పురుగుల ఊడిపోయిన రెక్కలు అతని కోర్కెలూ, ఆశలే-తన కళ్ళముందు ఎగురుతున్నట్లు అన్పించాయి. కోడిగుడ్డిదీపం కొడికడుతూవుంది-అతని జీవన జ్యోతిలాగే. అతని కళ్ళలో కాంతి వాడికట్టిపోయింది. దీర్ఘ నిట్టూర్పు విడిచాడు.

అతను ఒకభావ కవి. ఒక అమ్మాయిని ప్రేమించి ఓడిపోయాడు. ఆ అమ్మాయి సానుభూతిని సాధించడానికి త్రాగుబోతు అయ్యాడు. వ్యభిచారి అయ్యాడు. ఆస్తి అంతా హారతికర్పూరంలా హరించుకు పోయింది. చివరకు అతనికి మిగిలింది ఆ పూరిగుడిసె, కోడిగుడ్డు లాంతరూ, క్షయరోగం, అచ్చుగాని అతని కవితలు."

నాకథ తక్కున ఆగిపోయింది.

ఎదురింట్లో ఎవరో ఖళ్ళుఖళ్ళున దగ్గుతున్నారు. సెలయేరులా గలగలా పారుతున్న ప్రేమకథకు కట్టపడింది.

వెధవ కాలనీ. ఎప్పుడూ ఇంతే! ఇరుగు పొరుగు ఇళ్ళల్లో తుమ్మినా వినిపిస్తుంది. దగ్గినా వినిపిస్తుంది.

అరే! పాపం! గుక్క తిప్పుకోకుండా దగ్గుతున్నాడే? ఎదురింటి రాఘవరావు-ఎవరో కాదు. కథల్లో హీరో దగ్గుతూ బాధపడుతూ వుంటే ఆనందంతో కూడిన బాధ కలుగుతుంది. కాని మనిషి తన కళ్ళ ఎదురుగా నరకం అనుభవిస్తూవుంటే గుండెల్ని తోడేసినట్టు అనిపిస్తుంది. రాఘవరావుకు క్షయ. గుమాస్తా ఉద్యోగం చేస్తూ రోగం ముదిరి లీవు పెట్టాడు. భార్య అమాయకురాలు. అయితేనేం అరడజను పిల్లల్ని ప్రసాదించింది భర్తకు - ఆ పతివ్రత. ఎముకల్లో మూలుగు చచ్చి, కళ్ళల్లో కాంతి హరించిన ఆమె శరీరంలో మరో ప్రాణి జీవం పోసుకుంటూవుంది.

క్షయరోగం రాజరోగం. ఎంత డబ్బు ఖర్చుపెట్ట గలిగితే అంతకాలం బ్రతకవచ్చును. రాఘవరావుకు డబ్బు లేదు. అండలూ లేవు. ఏరోజు 'హరీ' అంటాడో చెప్పలేం! ఆ తర్వాత అసహాయురాలైన ఆ భార్యా-బిడ్డలూ....

ఛ! ఏమిటిది? నాకథ ఏమైందీ?

అరే! నా హీరో వడీ! అదుగో ఆ గుడిసెలో మూల చచ్చి పడివున్నాడు. కోడిగుడ్డు లాంతరు ఆరిపోయింది. చచ్చి పోయిన హీరోతో ఇంకా ఏం కథ వ్రాయను? చస్తే చచ్చాడు! అర్థాంతరంగా చచ్చేవాడు కథకు హీరో ఏమిటీ?

మళ్ళీ హీరోకోసం వేటా? పోనియ్! నీరజను హీరో యిన్, ఆమె భర్తను హీరోగా తీసుకొని కథరాస్తే? ఆమె

ప్రేమించి వివాహం చేసుకుంది. ప్రేమించి వివాహం చేసుకున్నాక—ఇంకా ప్రేమేమిటి ? కథేమిటి ?

"పెళ్ళాన్ని, పిల్లల్ని పోషించడం చాతకానివాడివి నువ్వూ ఒక మగాడివే ?" ఆడగొంతు మగవాణ్ణి ఏమాట అనకూడదో అదే అనేసింది.

"నోర్ముయ్ ! నువ్వేగా కావాలని వెంటబడి చేసుకున్నావ్ ?"-మగ కంఠం.

"ఓ యబ్బో ! నీమాత్రం మగాడు".... ఏడుపు గొంతుతో అన్నది ఆడది.

"నోర్ముయ్ లం....-

ధబీధబీమని శబ్దంతో పాటు మగవాడి గర్జింపు.

పక్కింటి కాంతమ్మ ఏడుపు తారస్థాయిని అందుకుంది. మొగుడు ఆమె జుట్టుపట్టుకొని వంగదీసి బాదుతున్నాడని అర్థం చేసుకున్నాను.

రాత్రి పదిగంటల తర్వాత ఆ ఇంట్లో రోజూ ఇదే వరస.

కాంతమ్మ భర్త సత్యనారాయణ, ఇంట్లో పెళ్ళాం బిడ్డలకు పొట్టనిండా తిండిలేకపోయినా, నాటుసారా అయినా తాక్కుండా ఇంటికిరాడు.

పాపం ! ఆ ఇల్లాలు కడుపుమండి తిడుతుందంటే తిట్టదూ మరి !

ఆకలి....ఎండుగడ్డిలాంటిది. భగ్గుమనడానికి ఏ చిన్న నిప్పురవ్వ అయినా చాలు.

ఈ దేశంలో స్త్రీల సమస్యలకు ఏనాటికైనా పరి

ప్రాకారం అంటూ వుంటుందా ? పుట్టినప్పటినుంచీ, చచ్చేంత వరకూ ఆడదానికి మగవాడి అండ కావాల్సిందేనా ?

కాని గిరిజ ఈ విషయం ఒప్పుకోదు. గిరిజా, నీరజా నేనూ ఒకే స్కూల్లో చదువుకున్నాం. గిరిజా, నీరజా కలిసి నాతో వాదించే వాళ్లు.

స్త్రీకి బతకటానికి పురుషుడి అండ అక్కర్లేదనీ, తరతరాలగా సమాజం నిర్మించిన గోడలమధ్య స్త్రీ కొండ శిలవలాగ బ్రతకడం తమకు ఇష్టంలేదనీ, సాధారణ జీవితానికి భిన్నంగా బ్రతికి, ఇలాకూడా బ్రతకవచ్చని నిరూపిస్తామని ఆవేశంగా అనేవాళ్లు. ముఖ్యంగా నీరజ దృష్టిలో స్త్రీ స్వతంత్రంగా బ్రతికడమంటే పురుషున్ని అనుకరించడం. ఆమెను అంతా 'మగరాయుడు' అనేవారు. స్కూల్ ఫైనల్ కాగానే ఢిల్లీ వెళ్ళింది. అక్కడ ఆమె జీవితంలో నిరంజన్ వర్మ అడుగుపెట్టాడు. అంతటితో ఆమె ఆదర్శాలన్నీ ఇసుకతో కట్టిన బొమ్మరిళ్ళే అయ్యాయి. అందర్నీ ఎదిరించి అతన్ని వివాహం చేసుకుంది. శ్రీమంతుల బిడ్డ నీరజ. జీవితం లోని చేదును రుచిచూసే అవసరం ఆమెకు కలగలేదు. అందుకే నీరజకు నా కథలు నచ్చవు.

తప్పక వ్రాయాలి. నీరజను మెప్పించే కథ తప్పక రాస్తాను. ఏది ఏమైనా ఇవ్వాళ ఈ ప్రేమకథ పూర్తి చేస్తాను.

కాని గిరిజమాత్రం ఇంకా తను నమ్మిన ఆదర్శాలను అంటిపెట్టుకొనే వుంది.

గిరిజ చిన్నప్పటినుంచీ జీవితంలో చేదునే రుచి

చూసింది. బీద కుటుంబంలో పుట్టింది. చిన్నతనంలోనే తల్లి ప్రేమకు దూరం అయింది. స్కూల్‌ఫైనల్ పాసయిన సంవత్సరమే తండ్రికూడా పోయాడు. పదిహేడు సంవత్సరాలు నిండని గిరిజమీద పన్నెండేళ్ళ తమ్ముణ్ణీ, పదేళ్ళ చెల్లెల్నీ పోషించవలసిన బాధ్యతపడింది. కొంతకాలం ఎలిమెంటరీ స్కూల్లో టీచర్‌గా పనిచేసి ప్రస్తుతం ఒక గవర్నమెంటు ఆఫీసులో స్టెనోగ్రాఫర్‌గా పనిచేస్తూంది.

గిరిజ అంటే గుర్తొచ్చింది. ఆఫీసు నుంచి వచ్చేప్పటికి అమ్మ అందించిన గిరిజ వ్రాసిన ఉత్తరం చదవడం మర్చే పోయాను.

కాగితాలూ, కలం పక్కన పెట్టి లేచి వెళ్ళి రేడియో మీద వున్న కవరు తీసి చింపి చదివాను. పన్నెండు పేజీల ఉత్తరం చూసి ఆశ్చర్యపోయాను. ఉత్తరాలు వ్రాయడంలో మహా బద్ధకస్తురాలైన గిరిజ అంత పెద్ద ఉత్తరం వ్రాయడం నాకు ఆశ్చర్యంతోపాటు, ఆదుర్దా కూడా కలిగింది. గబగబా చదవసాగాను....

"ప్రియమైన జానకీ!

ఎంతో కాలానికి చాలా పెద్ద జాబు వ్రాస్తున్నాను. నేను వ్రాసింది పూర్తిగా చదివి నన్ను అసహ్యించుకోకు. అర్థం చేసుకోవడానికి ప్రయత్నించు. నువ్వు రచయిత్రివి. నువ్వు నన్ను సానుభూతితో అర్థం చేసుకోగలవనే ఉద్దేశం తోనే నా మనసును తెరచిన పుస్తకంలా నీ ముందు ఉంచు తున్నాను.

నాకు చిన్నతనం నుంచీ ఆధ్యాత్మిక విషయాలమీద

ఆసక్తి ఎక్కువగా వుండేది. నాకు నేనే - "జీవితం" అంటే 'ఏమిటి ?' అంటూ ఊహ తెలిసినప్పటినుంచీ ప్రశ్నించుకొనే దాన్ని. ఎన్నోసార్లు నిన్ను అదే ప్రశ్న వేశాను. నవ్వు నవ్వేసే వాడివి. చాలామంది నన్ను పిచ్చిదానిగా భావించేవారు. అవును! పిచ్చిదాన్నే. జీవించడం తెలియనిదాన్ని.

మనం ఎందుకు బ్రతుకుతున్నాం? ఎందుకు బ్రతకాలి? జీవితం అంటే ఏమిటి? అనే ప్రశ్నలు ఎదురు కానివాళ్ళు నిజంగా అదృష్టవంతులు. ఎక్కువ తింటూ (అంటే దొరికింది అనుభవిస్తూ) తక్కువ ఆలోచించేవాళ్ళంత అదృష్ట వంతులు ఈ సృష్టిలో వుండరనుకుంటాను.

మేధావి అయిన పురుషుడు జీవితాన్ని చాలా తేలిగ్గా తీసుకుంటాడు. ప్రాక్టికల్‌గా బ్రతుకుతూ జీవితంలో అంది నంతవరకు భౌతిక సుఖాల్ని అనుభవిస్తాడు. కాని మేధావి అయిన స్త్రీలో సాధారణంగా ఆధ్యాత్మిక మనస్తత్వం పెంపొందుతుంది. ప్రాపంచిక విషయాలపట్ల విరక్తి పెరుగు తుంది. ఇటువంటి స్త్రీలు ఎక్కువగా కలల్లోనే బ్రతుకుతారు.

నేను చిన్నప్పటినుంచీ కలల్లోనే బ్రతికేదాన్ని. ఒక వస్తువును కల్పనలో ఊహించుకుంటే కలిగే ఆనందం వాస్త వంగా అనుభవించినప్పుడు కలగదని నా నమ్మకం.

అందుకే నేను మామూలు జీవితానికి భిన్నంగా బ్రతకాలనుకున్నాను.

కలలు కనడం తప్పుకాదు. ఆ కలల్నే జీవితంగా భావించడమే నేను చేసిన తప్పు. నాకు ఏది అక్కర్లేదో

తెలుసుకోవడానికి ప్రయత్నించానేకాని, నాకు కావాల్సిందే మిటో తెలుసుకుందామని ప్రయత్నించలేదు.

జానకీ! గుర్తుందా! ఓసారి నాతో అన్నావు....

"యథార్థం నుంచి నువ్వు ఎంతకాలం పారిపోగలవో చూస్తాను" అని.

కాని జానకీ! ఈనాడు నేను ఓడిపోయానని నీముందు చెప్పడానికి సిగ్గు పడటం లేదు.

యథార్థం ముందు ఆదర్శం తల వంచింది.

నేను పతితను.... అవునో కాదో నువ్వే తేల్చుకో."

అంతవరకూ చదివి నేను ఒణికిపోయాను. ఏమిటి గిరిజ పతితా! నమ్మలేకపోతున్నాను.

ఉత్తరం ఆత్రంగా ముందుకు చదవసాగాను.

"నేను ఒక ఆఫీసులో పని చేస్తున్నానని నీకు తెలుసుగా ?

ఆడంబరాలూ, కోరికలూ తక్కువే గనక ఎలాగో కుటుంబాన్ని ఈడ్చుకొస్తున్నాను వచ్చే జీతంతో. నాకు జీవితం సంతృప్తికరంగానే వుందనుకున్నాను. అది భ్రమే కావచ్చు! ఆ భ్రమే నాకు ఇష్టం!

నా కళ్ళముందే చిన్న చిన్న ఉద్యోగాల్లో చేరిన ఆడపిల్ల ఇట్టే ప్రమోషన్లు సంపాదించడం చూస్తుంటే ఆశ్చర్యంగా వుండేది. నా తర్వాత యల్.డి. స్టెనోగా చేరిన ఆమె నాకంటే ముందే యు. డి. స్టెనోగా ప్రమోషన్ తెచ్చుకుంది. అయినా నేను బాధ పడలేదు.

కొంతకాలంగా మా ఆఫీసరు నా మీద చిరుబురు

లాడటం ప్రారంభించాడు. అనవసరంగా కోప్పడేవాడు కిక్కురుమనకుండా గుడ్ల నీరు గుడ్ల కుక్కుకొని బయటికి వచ్చేదాన్ని.

ఆ మధ్య టైపింగ్‌లో ఒక చిన్న తప్పు చేసినందుకు నానా మాటలూ అని ఫైలు ముఖంమీదకు విసిరికొట్టాడు. వంగి ఫైలు తీసుకొని, నా సీటుకు గబగబా వెళ్ళిపోయాను. ఏడుపు పొర్లుకొచ్చింది. వెక్కి వెక్కి ఏడ్వసాగాను.

మా సూపరింటెండెంటు రాంమూర్తి వచ్చి నన్ను ఓదార్చాడు. అతను నన్ను ఎంతో ఆదరంగా చూసేవాడు. అతన్ని చూడగానే ఏడుపు కట్టలు తెంచుకుంది.

"ఊరుకోమ్మా! సర్వీస్ అంటే ఇంతే! మనం ఎన్.జీ. ఓ. లం. గంజికి లేనివాళ్లం. దగాపడిన వాళ్ళం. తిట్టడం వాళ్ళ హక్కు. పడటం మన బాధ్యత" అన్నాడు రాంమూర్తి.

"నేనేం చేశానండీ? పని బాగానే చేస్తున్నానే? ఆఫీసరుగారికి ఎందుకండి అంత కోపం?" అడిగాను.

"పిచ్చి పిల్లా! అతనికి కావాల్సింది నీపని కాదమ్మా" అతని కావాల్సిందేదో నువ్వు అర్థం చేసికొని ఇవ్వ లేదమ్మా...

"అంటే!" అన్నాను అయోమయంగా.

"ఏముందీ—నువ్వూ ఆ శీలా, రమణీ, సావిత్రిలాగ.... ఆగిపోయాడు రాంమూర్తి.

"రాంమూర్తిగారూ?" దాదాపు అరిచినట్టే పిల్చాను.

"నిన్ను అలా ప్రవర్తించమనడం లేదమ్మా. ఆఫీసరుగారి కోపానికి కారణం చెబుతున్నాను."

నాకు ఆశ్చర్యం వేసింది. నా కాళ్ళ కింద భూమి నన్ను దగా చేస్తున్నట్లనిపించింది. ఏభయ్ ఏళ్ళకు పైబడ్డ ఆ ఆఫీసరుకు ఇదేం రోగం? మళ్ళీ తన పిల్లలందరికీ పద్ధాను గేళ్ళు నిండకుండానే పెళ్ళిళ్లుచేసి అత్తవారి ఇండ్లకు పంపించాడట. ఆ విషయం విని 'పూర్వకాలపు మనిషి' అనుకుంది తను.

ఆరోజు మనసంతా చీదర చీదరగా వుంది. వారం రోజుల వరకూ ఆ ఆఫీసరు నన్ను పిలవలేదు. ఆ తరవాత నేను పదిరోజులు శెలవు పెట్టాను.

శెలవునుంచి ఆఫీసుకు వెళ్ళిన రోజే మా ఆఫీసరుకు ట్రాన్స్‌ఫర్ అయిందని విన్నాను.

వచ్చే ఆఫీసరు చాలా చిన్నవాడనీ, జలసారాయుడనీ ఏ మేమో చెప్పుకుంటున్నారు.

నాకు మరీ భయం పట్టుకుంది. సైకో ఉద్యోగం మానేసి ఏ టైపిస్టుగానో ఉద్యోగం సంపాదించుకుంటే బాగుండు ననుకున్నాను.

అది కొత్త ఆఫీసరు వచ్చేరోజు.

ఫేర్ వెల్ పార్టీకి హంగామా చేస్తున్నారు.

శీలా, సావిత్రీ, రజయా చక్కగా ముస్తాబై వచ్చారు. సీతాకోక చిలకల్లా ఉత్సాహంగా తిరుగుతున్నారు.

నాలో ఉత్సాహం లేదు. టైపురైటరు ముందు

కూర్చుని ఆ హడావిడి అంతా చూస్తున్నాను. అప్రయత్నంగానే నేను కట్టుకున్న చీరకేసి చూసుకున్నాను. మనసు చివుక్కుమంది. వెలిసిపోయి బూడిదరంగుపడ్డ నీలంరంగు నేత చీర - కొంచెం సిగ్గనిపించింది. మళ్ళీ నాకు నేనే సమాధాన పర్చుకున్నాను.

"ఏం? ఎందుకు సిగ్గుపడాలి? బీదతనానికి సిగ్గు పడాల్సిందేముంది? తప్పుపనులు నేనేం చెయ్యడం లేదుగా! అయినా నా వేష భాషల్తో ఆఫీసర్ల కేం సంబంధం? పని చేస్తున్నాను. జీతం ఇస్తున్నారు."

నేను శీలా వాళ్ళతో కలవాలని ప్రయత్నించినా వాళ్ళు నన్ను దూరంగానే వుంచుతున్నారు.

ప్రతి చిన్న విషయానికీ పకపకా నవ్వడం, పెద్దగా మాట్లాడటం, వయ్యారంగా నడవడం, వాలు చూపులు చూడటం....ఏమిటో ... ఏమిటోగా .... అచ్చం ఆడపిల్లల్లా ప్రవర్తిస్తూ వుంటారు. ఆఫీసులో పని చేస్తున్నామనే ఆలోచనే వున్నట్టు కన్పించదు. వాళ్ళు మాట్లాడే అబద్దాలు వింటుంటే మరీ బాధగా వుండేది.

ఎక్కడైనా బజార్లో ఎదురు పడితే, ఒక ఆఫీసులో వాళ్ళంగదా అని "ఎక్కడినుంచి? అని ప్రశ్నిస్తే ఉలిక్కిపడి తప్పుకు పోయేవాళ్లు. ఆ సమయంలో వాళ్ళ కళ్ళలో ఏదో భయం స్పష్టంగా కన్పిస్తుంది. ఇటువంటివారు చాలా మంది నల్ల ముసుగుల్లో బ్రతుకుతూ వుంటారు. ఎప్పుడు, ఎవరు, వాళ్ళ ముసుగుల్ని తొలగించి అసలు రూపాన్ని పట్టు

కుంటారో అన్నట్టు బెదిరిపోతూ బతుకుతారు. అందువల్లనే ధైర్యంగా, నీతిగా బతుకుతూ నిజం మాట్లాడేవాళ్ళంటే వీళ్ళకు గిట్టదు.

ఓ మూల కూర్చుని ఆలోచిస్తున్న నేను "ఏమ్మా! ఇంకా ఇక్కడే వున్నావ్ ? పద పార్టీ మొదలైంది" అన్న రాంమ్మూర్తిగారి మాటకు ఉలిక్కిపడి లేచి నిల్చున్నాను.

యాంత్రికంగా అతన్ని అనుసరించాను.

"ఉన్నదే ఆఫీసులో నలుగురు ఆడవాళ్లు. వెళ్ళే నిన్నుకూడా పిలవకూడదూ ? వెకిలిసంత నిన్నెందుకు పిలుస్తార్లే! వాళ్ళకుమాత్రం తెలియదూ! హంస పక్కన కాకుల్లా వుంటామని !" గొణుక్కున్నాడు రాంమ్మూర్తి.

ఆయన చూపిస్తున్న ఆదరణకు నా కళ్ళలో నీరు తిరిగింది.

పార్టీలో కూర్చున్న అందరి కళ్ళూ ఆలస్యంగా వస్తూన్న నావైపే తిరిగాయి.

నేను కట్టుకున్న చీరెను గురించి వద్దనుకుంటూనే ఆలోచిస్తూ సిగ్గు పడ్డాను.

బెదురు బెదురుగా శీలా వాళ్ళకోసం వెదికాను. వాళ్లు ఆఫీసర్ల దగ్గరగా వున్న టేబుల్ ముందు కూర్చుని వున్నారు. వాళ్లు నన్ను చూసి ముసిముసిగా నవ్వుకున్నారు.

నాకు వళ్లు మండిపోయింది. గబగబా వెళ్ళి వాళ్ళ

దగ్గరే కూర్చున్నాను. నేను అలా వెళ్ళి కూర్చోగానే ఇక్కడ్రు మనకుండా టిఫెన్ తింటున్నట్టు నటించసాగారు.

నాలో గర్వం తలెత్తింది.

"నా వ్యక్తిత్వం ముందు మీ రెంత ! మీ దుస్తులు మెరుస్తాయి. కాని మనసంతా కారుచీకట్లు కమ్మి వుంటాయి. ప్రపంచంలో తలెత్తుకొని బతికే ధైర్యంలేదు. నా దుస్తులు వెలాతెలా పోతుంటాయి. కాని నాకు మనసులో చీకటి గదులు లేవు," అరిచి అరిచి వాళ్ళకు వినిపించా లనిపించింది.

"ఆమె గిరిజ ! ఇక్కడ స్టెనో !"

పాత ఆఫీసరు గొంతు విని చివుక్కున లేచి నిల్చున్నాను. కొత్త ఆఫీసరుకు నమస్కరించాను.

"కూర్చోండి !" అన్నాడు ప్రతి నమస్కారంచేస్తూ కొత్త ఆఫీసరు.

నా సర్వీసులో ఆఫీసరు ప్రతి నమస్కారం చెయ్యడం, బహువచన ప్రయోగం చెయ్యడం మొదటిసారి చూశాను.

ప్రతి ఆఫీసరూ ఇంట్లో పిల్లాన్ని పిల్చినట్టు గిరిజా ! నువ్వా !" అని పిల్చినవాడే. అలా పిలుస్తుంటే నాలోని రక్తం కుతకుత లాడేది. కాని ఏం చేస్తాను ? 'పేదవాడి కోపం పెదవికి చేటు' అని పెద్దలు ఊరికినే అనలేదు.

శీలా, సావిత్రీ కిలకిల నవ్వడంతో నేను మళ్ళీ ఈ

లోకంలోకి వచ్చాను. ఆఫీసర్లకేసి చూశాను. కొత్త ఆఫీసరు నన్నే గమనిస్తున్నట్టు గ్రహించి ఏదోగా అయిపోయాను. తల వంచుకొని గబగబా టిఫిన్ చెయ్యసాగాను.

కొత్త ఆఫీసరు నన్నే రెప్ప వాల్చకుండా చూస్తున్నట్టు అన్పించింది. కుర్చీలో ఇబ్బందిగా కదిలాను.

శీలా, సావిత్రీ, రజయా కబుర్లు చెప్పుకుంటూ మధ్య మధ్య కిలకిల నవ్వుతున్నారు. అదంతా కొత్త ఆఫీసర్ని తమవైపుకు ఆకర్షించడానికి చేసే ప్రయత్నమేనని, అనిపించింది. నా మనసంతా జుగుప్సతో నిండిపోయింది.

అందరూ లేచారు. నేను నిల్చుని అనుకోకుండానే కొత్త ఆఫీసర్ ముఖంలోకి చూశాను. ఆయన నా కళ్ళలోకి చూశాడు. నాకు తెలియకుండా నా కళ్లు సిగ్గుతో వాలిపోయాయి. మగవాడిదగ్గిర ఆడది సిగ్గుపడుతుండంటే, తన బలహీనతను వ్యక్తం చేసుకోవడమేనని నా భావం. గుండెలు వేగంగా కొట్టుకున్నాయి.

ఎన్నడూలేని ఈ అనుభూతి ఏమిటి? ఎన్నో ఆదర్శాల గురించి మాట్లాడే నాతోకూడా మామూలు - ఆడపిల్లల్లో ఏర్పడే బలహీనత చోటుచేసుకోలేదుగదా? నో! నో! అలా ఎన్నటికీ జరగదు. జరక్కూడదు. జరగటానికి వీల్లేదు.

నాలో నేనే మధనపడుతూ, నా బలహీనతను శీలా వాళ్ళు గమనించారేమోననే భయం కలిగి వాళ్ళకేసి చూశాను.

వాళ్ల కళ్ళలో అసూయ తేలుపిల్లలా కొండే ఎత్తి తిరగడం గమనించాను. అది చూసి నాలో గర్వం పొంగింది. విజయగర్వంలో వుండే ఆనందాన్ని మొదటిసారిగా చవి చూశాను.

కొత్త ఆఫీసర్ పేరు కుమార్. అందం, అధికారం, హుందాతనం అన్నీ ఒకే వ్యక్తిలో మూర్తీభవించాయా అన్నట్లుంటాడు. ముఖంలో మంచితనం కన్పిస్తుంది. తెలియకుండానే అతనంటే నాకో ప్రత్యేక అభిమానం ఏర్పడింది.

డ్రాఫ్ట్ డిక్టేట్ చేస్తున్నంతసేపూ అతను నన్నే పరీక్షగా చూస్తున్నట్టు, తలవంచుకొని వ్రాసుకొనే నాకు అనిపించేది.

నాకు ఇబ్బందిగా అన్పించేది. అయినా అక్కడే అలాగే ఎంతసేపయినా కూర్చోవాలనిపించేది. అక్కడినుంచి వెళ్ళాలనిపించేది కాదు. భయం, ఆనందం రెండూ హృదయంలో రాక్ అండ్ రోల్ డ్యాన్స్ చేస్తున్నట్టనిపించేది. ఆ అల్లరిలో ఆయన చెప్పేది సరిగా విన్పించేదికాదు. తీరా డ్రాఫ్ట్ టైప్‌చేసి తెస్తే ఆయన పకాపకా నవ్వేవాడు. ఆయన డిక్టేట్ చేసినదానికీ, నేను టైప్ చేసినదానికీ ఎక్కడా సంబంధం వుండేదికాదు. భయంతో బిగుసుకు పోయేదాన్ని ఆయనకు ఎక్కడ కోపం వస్తుందోనని. కాని ఆయన డ్రాఫ్ట్ కరెక్ట్‌చేసి మళ్లీ టైప్ చెయ్యమనేవాడు.

ఎంత "మంచివాడు!" అని మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకొనేదాన్ని.

నాకు అప్పుడప్పుడు ఆయన నన్ను ప్రేమిస్తున్నాడేమోననుకునేదాన్ని. మళ్ళీ అంతలోకే "ఇది తెలుగు నవల్లో కథ కాదు. లేక తెలుగు సినిమా కాదు. జీవితం ... జీవితం.... కఠోరవాస్తవం...." అనుకునేదాన్ని.

ఒకరోజు ఐదుగంటలకు పదినిముషాలు వున్నదనగా నన్ను పిల్చాడు. డ్రాఫ్ట్ డిక్టేట్ చేస్తున్నాడు. కాని ఆయనలో ఆరోజు నాకేదో మార్పు కన్పించింది. పరధ్యాన్నంగా వున్నాడు. నన్నుగురించే ఆలోచిస్తున్నాడేమోననే భావం రాగానే నాకేదో తమాషా అనుభూతి కలిగింది.

అతనికి వివాహం కాలేదు. నిజంగానే నన్ను ప్రేమిస్తున్నాడేమో ! నా గుండెలు స్పందించాయి.

డ్రాఫ్ట్ టైపుచేసి ఇచ్చేసి బయటికి వస్తుంటే వెనక్కి పిల్చాడు. ఆలస్యం అయిందనీ నన్ను కార్లో డ్రాప్ చేస్తాననీ అన్నాడు. గుండెలు దడదడ కొట్టుకున్నాయి. 'రాను' అని చెప్పాలనుకున్నాను. చెప్పలేకపోయాను. ఆయనంటే నాకు గౌరవం.........కాదు ఇష్టం. అందుకనే మౌనంగానే అంగీకరించాను.

కిక్కురు మనకుండా బెదిరే చూపులతో, అదిరే గుండెలతో, వణికే కాళ్ళతో కారుపక్కన బిక్కు బిక్కుమంటూ నిల్చున్నాను. తను వచ్చి స్టీరింగ్ దగ్గిర కూర్చుంటూ నన్ను కూర్చోమన్నట్టు, ముందుసీటు డోర్ తెరిచాడు. నాకు కాళ్లూ చేతులూ చల్లబడ్డాయి. డైరెక్టర్ పక్కన... కూర్చోవడం.... ఊహించు లేకపోతున్నాడు.

"ఊ! ఎక్కు!" ఎంత దర్పం? ఎంత అధికారం? అయినా నాకు కోపం రాలేదు. మరో ఆఫీసరైతే "ఏం? ఎందుకు ఎక్కాలి?" అని అడిగే ధైర్యం నాకుంది. కాని.... కాని.... బహుశా అతను నన్ను పెళ్లి చేసుకోవా లనుకు న్నాడేమో?

"ఎక్కు!"

కొందరి అధికారంకూడా ఆనందాన్నే కలిగిస్తుందని మొదటిసారిగా తెలుసుకున్నాను. పక్కసీట్లో ఒదిగి కూర్చు న్నాను.

చేతులు చల్లగా వున్నాయి. కారు చార్‌మినార్ వైపుకు పోతూంది.

నా చేతిని ఒక బలమైన చెయ్యి నొక్కింది. ఉలిక్కి పడ్డాను. ఆఫీసరు ఒక చేత్తో కారు నడుపుతూ? రెండో చేత్తో నా చెయ్యి పట్టుకున్నాడు. నా శరీరం బిగుసుకుపోయింది. నాకు ఊపిరి సలపనట్టు అన్పించసాగింది.

"గిరిజా!". అతని కంఠంలో అదోలాంటి మృదుత్వం- ఆ కంఠంలోని మృదుత్వం నాకు ఎబ్బెట్టుగా తోచింది. అతని చేతిలో నా చెయ్యి వుంది.

పళ్ల చక్రం క్రింద నలిగిపోతున్న చెరకుగడలా జవజవ లాడిపోయాను భయంతో.

"భయపడకు. నేను ఆఫీసర్నని మర్చిపో. ఇప్పుడు

మనం—ఒక పురుషుడూ....ఒక స్త్రీ మాత్రమే" అన్నాడు నన్ను దగ్గిరకు లాక్కుంటూ. కారు ఊరిబయట రోడ్డుమీద చిన్నగా పోతూంది.

"నేను దిగిపోతాను. దయచేసి కారు ఆపండి-" అనా లనుకున్నాను. గొంతు పెగల్లేదు. అతని చేతినుంచి నా చేతిని లాక్కోవాలనుకున్నాను. శక్తిలేదు.

"భయపడకు!" అంటూ దగ్గిరకు లాక్కున్నాడు. నేను కొంచెం దూరంగా జరిగాను. పెనుగులాడి వదిలించుకుంటూ వుంటే కారు ఆపాడు.

"నే నంటే నీకు ఇష్టం లేదా! చూడు నా కళ్లలోకి చూసి చెప్పు!" అన్నాడు.

"అవును! నువ్వంటే నాకు ఇష్టమే. చాలా చాలా ఇష్టం! కాని నాకు ఇలా బతకడం ఇష్టంలేదు. నా అందమైన కలల్ని క్రూరంగా చెరిపివెయ్యవద్దు," అందామనుకున్నాడు. అన్నా అతనికి అర్థంకాదు. అతని ధోరణే చెబుతుంది. విసుక్కుంటున్నాడు.

"నువ్వు మంచిదానివి. అందుకే నీతో స్నేహం చెయ్యాలనుకుంటున్నాను. అంతేగాని నాకు చీప్‌గర్ల్స్‌తో స్నేహం చెయ్యడం ఇష్టం వుండదు," అన్నాడు.

అతని ఉద్దేశం అర్థం అయింది. మనసంతా జుగుప్సతో నిండిపోయింది.

ఇటువంటి స్నేహం చెయ్యడానికి కూడా మగవాడికి మంచి ఆడవాళ్లే కావాలి కాబోలు! మంచి అంటే అతని దృష్టిలో ఏమిటో నాకు అర్థం కాలేదు. నేను-శీలా, రజియా లాంటిదాన్ని కాదని తల బద్దలు కొట్టుకొని చెప్పాలని వుంది. అతను వినిపించుకోడని నాకు తెలుసు. నిజంగా అతనికి కావాల్సింది నేను ఎలాంటి దాన్ననికాదు.... నేను వయసులో వున్న ఆడదాన్ని .... అతనిక్కావాల్సింది నా శరీరం మాత్రమే. మనసు కాదు.

"మీ చెల్లెల్ని ఎవరైనా ఆఫీసరు ఇలా చేస్తే ఏం చేస్తారు?" అన్నాను అనుకున్నాను. కాని మాటలు కంఠం లోనే ఉంగిడి చుట్టుకుపోయాయి.

అసహాయంగా కారు తలుపుకు తల కొట్టుకుంటూ ఏడ్చాను కాని అతను నా మానసిక పరిస్థితి అర్థం చేసుకోలేదు.

"ఫస్ చెయ్యకు." అని విసుక్కున్నాడు.

"మీ ఇల్లెక్కడ?"

"చిక్కడపల్లి" వెక్కిళ్ల మధ్యలోనే అన్నాను.

కారు స్టార్టు చేశాడు. స్పీడుగా పోతూంది. ఇంటి వైపుకు కాదు. ఊరికి దూరంగా నిర్జన ప్రదేశంలోకి వెళ్ళి ఆగిపోయింది.

ఆ తర్వాత ఏం జరిగిందీ వ్రాయడం అనవసరం.

"నువ్వు జీవితంలో అనేకమంది ఆడపిల్లల్తో స్నేహం

చేసి వుండవచ్చును. అందులో నేనూ ఒకదాన్ని కావచ్చు నీ దృష్టిలో. కాని నువ్వు నా జీవితాన్ని కారుమేఘంలా చుట్టివేశావనీ, నా జీవితాన్నే తారుమారు చేశావనీ ఎలా చెప్పను ?" చెప్పినా అతనికి అర్థం కాదు. ఆఫీసు ఫైల్సు అర్థం చేసుకోవటమూ, స్త్రీ హృదయాన్ని అర్థం చేసుకోవడమూ అతని దృష్టిలో ఒకటే.

కారు ఇంటిముందు ఆగింది.

"నేను రేపు కాంపు వెళ్తున్నాను. రెండో తేదీ మళ్ళీ కలుసుకుందాం. బి ప్రాక్టికల్" అంటూ నా జవాబుకు ఎదురు చూడకుండానే కారు స్టార్ట్ చేశాడు.

నేను ఎవరో వెనకనుంచి తరుముతున్నట్టు ఇంట్లోకి పరిగెత్తాను.

చెల్లి ముఖంలోకి కానీ, తమ్ముడి ముఖంలోకి కానీ చూసే ధైర్యం లేదు.

గదిలోకి వెళ్ళి, గడియ బిగించుకొని దిండులో ముఖం దాచుకొని వెక్కి వెక్కి ఏడ్చాను. అలా ఎంతసేపు ఏడ్చానో నాకే తెలియదు.

నేను తప్పు చేశాను.

ఆ ఆఫీసరంటే నాలో తెలియకుండానే బలహీనత ఏర్పడింది. అతను నన్ను ప్రేమిస్తున్నాడనీ, పెళ్ళి చేసుకుంటాడనీ భ్రమ పడ్డాను. మరి నేనూ, నాలాంటి ఆడపిల్లలూ ఇలాంటి భ్రమల్లో పడక ఏం చేస్తాం ? మీ రచయితలూ,

రచయిత్రులూ ఇటువంటి కథల్లో ఇదే జీవితం అనే భ్రమ మాకు కల్పిస్తూ వుంటే? అందమైన ఊహాలోకాల్లోకి మమ్మల్ని విసిరేస్తూవుంటే....

నా కలలు కరిగిపోయాయి. నా ఆశలూ, నా ఆశయాలూ నన్ను దగా చేశాయి.

నేను జీవితంలో మొదటిసారిగా గౌరవించిన పురుషుడే నన్ను దగా చేశాడు.

తెల్లవారి ఆఫీసుకు ఏ ముఖం పెట్టుకు వెళ్ళను? నాకూ శీలకూ భేదం ఏమిటి? ఇకనుంచి ఆఫీసులోని ప్రతి మగ వాడూ నాతో సరసాలు ఆడటానికి జంకడు. ఆఫీసరు మళ్ళీ రెండో తేదీ వస్తాడు. మళ్లీ రమ్మంటాడు. ఒకసారి లొంగి పోయిన నేను రెండోసారి ఎలా తప్పించుకోగలను? అతని దృష్టిలోకూడా నేను లోకువే అయిపోతానని నాకు తెలుసు.

కాలు జారకుండానే వుండాలి. కాని ఒకసారి జారిన తర్వాత ఆ పతనం ఎక్కడ ఆగుతుందో చెప్పలేం.

నా జీవితం మలుపు తిరిగింది.

కాలు బురదలో పడింది, వెనక్కు రాలేను. వచ్చినా నా కాళ్ళకు అంటుకున్న ఆ బురద అలాగే వుండిపోతుంది. ముందుకుపోతే గొంతులోతు ఊబిలో దిగబడిపోతాను. అటు వంటి బ్రతుకు నేను బ్రతకలేను.

పన్నెండు కొట్టింది. ప్రపంచమంతా నిద్రాదేవి ఒడిలో ఒరిగిపోయి వుంది.

కొందరు దురదృష్టవంతులకు స్వప్నాలుకూడా సుఖకరమైనవి రావు. నేను మెలుకువలోనే దుస్వప్నం చూస్తున్నాను.

ఇక నాకు జీవించే హక్కులేదు.

ఆత్మహత్య మహా పాపం అని శాస్త్రాలు చెపుతున్నాయి, చాలామంది దృష్టిలో ఆత్మహత్య పిరికివాడు చేసేపని.

కాని, జానకీ! ఆత్మహత్య చేసుకోవడానికి చాలా ధైర్యం కావాలి. పిరికివాడు చావలేడు. హత్యచేసే వాడికంటే, ఆత్మహత్య చేసుకొనేవాడికి ఎక్కువ ధైర్యం వుండాలి.

సగం చేతులూ, కాళ్లూ ఊడిపోయికూడా కుష్టువాడు ఎందుకు బతుకుతాడు? ఆడది పడుపు వృత్తితో ఎందుకు పొట్టపోసుకుంటుంది? అణా ఎత్తు ముక్కుపోగుకోసం మనిషి పశువుగా మారి, పసిదాని పీక ఎందుకు కోస్తాడు?

బతుకుమీాది తీపిని వదులుకోలేకనే!

నేను జీవితంలో ఓడిపోయాను. దగా పడిపోయాను. రాజీ బతుకు బతకలేను. అందుకే బతికి రోజూ చచ్చేకంటే, చచ్చి బతుకుదామని వెళ్ళిపోతున్నాను.

నా చెల్లినీ, తమ్ముణ్నీ, ఈ విశాల ప్రపంచంలో దిక్కు-లేనివాళ్ళను చేసి వెళ్ళిపోతున్నాను.

జానకీ! నువ్వు రచయిత్రివి. నా కథ వ్రాస్తావుకదూ? తియ్యటి ప్రేమ కథలు చదివి, ప్రేమించే ఆఫీసర్ల కోసం ఎదురుచూసే ఆడపిల్లల్ని నా కథద్వారా హెచ్చరించు. తన దగ్గిర పనిచేసే స్టెనో గ్రాఫర్లనూ, టైపిస్టులనూ, క్లర్కు-ల్నీ-ఏ ఆఫీసరూ ప్రేమించి పెళ్ళి చేసుకోడని చెప్పు.

అందుకే నా కథ నీకు విన్పించాను. రాస్తావుగదూ?

శెలవు.

ఇట్లు,

"నీ గిరిజ"

ఉత్తరం పూర్తి చేశాను. చదువుతున్నంతసేపూ నా కళ్ళ నుంచి నీళ్లు కారుతూనే వున్నాయి.

గిరిజ ఈ పాటికి ఆత్మహత్య చేసుకొనే వుంటుంది. నా వెన్నెముకలో ఏదో జర జర పాకినట్టు అనిపించి నిలువెల్లా వణికిపోయాను.

గిరిజ తన కథ వ్రాయమని కోరింది.

నీరజ ఒక మంచి ఘాటైన ప్రేమకథ వ్రాయమని అడుగుతూంది.

ఇద్దరి కోరికల్లో ఎంత వైవిధ్యం ?

కొందరు స్వార్థపరుల, కలుషిత హస్తాల్లో గిరిజ లాంటి వారి జీవితాలు నలిగిపోతూవుంటే, ఎండమావుల కోసం అర్రులు చాస్తూ అమాయకంగా శీలా, రజియా, సావిత్రీ లాంటి వాళ్లు పతనం అయిపోతూవుంటే, నేను నీరజలాంటి వారి మనస్సుల్ని ఉర్రూతలు ఊగించడానికి సుశీలా, మోహన్ కథలు ఎలా వ్రాయగలను ?

పక్కింటి కాంతమ్మా, ఎదురింటి రాఘవరావూ, బస్ స్టాండులోని బిచ్చగాడూ, గిరిజలాంటి దగాపడిన స్త్రీలూ శీలా, రజియా, సావిత్రీ లాంటి అమాయకులూ– నేను ఎప్పుడు ప్రేమ కథ వ్రాయాలని కూర్చున్నా అడ్డం వస్తూనేవున్నారు.

తలెత్తి చూశాను. భళ్ళున తెల్లవారింది.

నేను వ్రాయాలనుకున్న ప్రేమకథ పూర్తి కాలేదు.

—(౦)—